సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



స్థలాలు పట్టాలకే పరిమితం

పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలకు సంబంధించి స్థలాలు చూపించాలని బాధితులు, బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. 8లో▸



కష్టసుఖాలు మన సృష్టే..

మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు పదో రోజుకు చేరుకున్నాయి. 8లో▸



హోటళ్లలో తనిఖీలు

నూతన సంవత్సవ వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో బాలాపూర్ పోలీసులు మండి హోటళ్లలో సోదాలు నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డా. ఖాదర్ వలీ


శంకర్‌పల్లి: నిత్యం చిరు ధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, జీవనశైలిని పొందొచ్చని మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా, పద్మశ్రీ డా.ఖాదర్ వలీ అన్నారు. మండల పరిధిలోని దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్‌మెంట్ (సీడబ్ల్యూడీ), క్లబ్ ఐనా ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచంలో చాలా మంది బియ్యం, గోధుమలతో చేసిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటున్నారని, వీటితో పలు ఆరోగ్య సమస్యలు వస్తున్నట్లు స్పష్టం చేశారు. నిత్యం మనం తీసుకోనే ఆహారంలో క్రమం తప్పకుండా చిరు ధాన్యాలను చేర్చాలని సూచించారు. తద్వారా అనేకమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఫిజియోథెరపిస్ట్, యోగా థెరపిస్ట్ డా. పి.విజయ్‌కుమార్, వైస్ చాన్సలర్ డా.ఎల్.ఎస్ గణేశ్, రిజిస్ట్రార్ డా.ఎస్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాసబ్ చెరువును పరిశీలించిన హైడ్రా బృందం



తుర్కయంజాల్: హైడ్రా అధికారుల బృందం మున్సిపల్ పరిధిలోని మాసబ్ చెరువును ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించింది. చెరువు చుట్టూ తిరిగి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిని పరిశీలించిన అనంతరం ఆదిత్యానగర్ కాలనీలో కాలనీ వాసులతో అధికారులు ముచ్చటించారు. మీరు ఎప్పటి నుంచి ఇక్కడ నివాసం ఉంటున్నారు.. ప్లాట్లను ఎప్పుడు కొనుగోలు చేశారు అని అడిగి తెలుసుకున్నారు. వెంచర్‌కు సంబంధించిన డ్యాక్యుమెంట్లు తీసుకుని హైడ్రా కార్యాలయానికి రావాలని కోరినట్లు సమాచారం. కార్యక్రమంలో హైడ్రా విచారణ అధికారి బాచిరెడ్డి, ఇరిగేషన్ డీఈఈ చెన్న కేశవరెడ్డి, ఏఈఈ వంశీ, అబ్దుల్లాపూర్‌మెట్ సర్వేయర్ జ్యోతి పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో కాకతీయుల ఆనవాళ్లు



గుర్తించిన నంది విగ్రహం

కొత్తూరు: మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో కాకతీయుల ఆనవాళ్లు ఉన్నట్లు పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి అన్నారు. నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పట్నం కృష్ణంరాజు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన సోమవారం గ్రామంలో పర్యటించారు. వారం రోజుల క్రితం ఓ రైతు పొలంలో గుర్తించిన పురాతన రాతి నంది విగ్రహాన్ని గ్రామస్తులు పురావస్తు శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. విగ్రహాన్ని పరిశీలించిన ఆయన క్రీ.శ 13వ శతాబ్దానికి చెందినదిగా తెలిపారు. నంది విగ్రహం లభ్యమైన ప్రాంతంలోనే నాలుగేళ్ల క్రితం శివలింగం కూడా బయటపడడంతో సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. 13వ శతాబ్దంలో కాకతీయులు ఈ పరిసరాల్లో తిరిగిన ఆనవాళ్లకు చిహ్నంగానే ఈ విగ్రహాలు లభ్యమైనట్లు ఆయన వివరించారు.

శంషాబాద్ నుంచి తుక్కుగూడకు ఏరో బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగుల కోసం శంషాబాద్ బస్‌స్టేషన్ నుంచి తుక్కుగూడ వరకు ఏరో రైడర్ ఆర్డినరీ బస్సులను జనవరి 1వ తేదీ నుంచి నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సులు ఎయిర్‌పోర్టు మీదుగా రాకపోకలు సాగించనున్నాయి. ఎయిర్‌పోర్టులో పనిచేసే ఉద్యోగులు, కార్గోసంస్థలు, ఫార్మాసంస్థల్లో పని చేసే వారు ఈ బస్సులను వినియోగించుకోవచ్చు. రూ.1,150కు నెలవారీ బస్‌పాస్‌లు పొందొచ్చు. ఈ పాస్‌లు ఏరోరైడర్ బస్సులతో పాటు అన్ని సిటీ ఆర్డినరీ, సబర్బన్ బస్సుల్లో చెల్లుబాటవుతాయి. శంషాబాద్ బస్‌స్టేషన్ నుంచి మొదటి బస్సు ఉదయం 6 గంటలకు, చివరి బస్సు సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరుతుంది. తుక్కుగూడ నుంచి మొదటి బస్సు ఉదయం 6 గంటలకు, చివరి బస్సు సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరుతుందని అధికారులు వెల్లడించారు.

కొత్త వేడుకలపై నిఘా



ఆంక్షలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనేవారు ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దు. పోలీసుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా వేడుకలు జరుపుకోవాలి. ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌పై ప్రత్యేక నిఘా పెడుతున్నాం. అనుమతి లేకుండా మద్యం వినియోగించినా.. డ్రగ్స్, గంజాయి వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– కిషన్, ఏసీపీ, చేవెళ్ల

నూతన సంవత్సర సంబరాలకు సిద్ధం

- ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లో ఏర్పాట్లు
- పోలీసుల స్పెషల్ ఫోకస్
- అనుమతి తప్పనిసరని సూచన
- ప్రత్యేక బృందాలతో తనిఖీలు
- హద్దుమీరితే చర్యలు తప్పవని హెచ్చరిక

మొయినాబాద్: 2024కు వీడ్కోలు చెబుతూ.. 2025కు స్వాగతం పలుకుతూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు అంతా సిద్ధమయ్యారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈసారి నూతన సంవత్సర వేడుకల నిర్వహణపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించడానికి పటిష్ట బందోబస్తు, పెట్రోలింగ్ నిర్వహించనున్నారు. నిబంధనలు అతిక్రమించి వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ముందస్తు అనుమతి తీసుకోవాలి

నగర శివారుల్లోని మొయినాబాద్, శంషాబాద్, షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాల్లో ఫాంహౌస్‌లు, రిసార్ట్స్ అధికంగా ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లో డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతాయి. ఈసారి సైతం ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌ల్లో భారీ ఏర్పాట్లే జరుగుతున్నాయి. వేడుకలు నిర్వహించేవారు ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలని సైబరాబాద్ పోలీసులు పదిహేను రోజుల నుంచే చెబుతున్నారు. ఇప్పటి వరకు కొన్ని రిసార్ట్స్‌లో నిర్వహించే వేడుకలకే అనుమతి తీసుకున్నట్లు తెలిసింది. అనుమతి లేకుండా వేడుకలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సైబరాబాద్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు వేడుకల సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

విస్తృత తనిఖీలకు ఏర్పాట్లు

డిసెంబర్ 31 రాత్రి జరిగే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రధాన రోడ్లతో పాటు, గ్రామాల రోడ్లలో డ్రంకెన్ డ్రైవ్, వాహనాల తనిఖీలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లో నిర్వహించే వేడుకల్లో డ్రగ్స్, విదేశీ మద్యం వినియోగించే అవకాశం ఉండటంతో వాటిపై నిఘా పెడుతున్నారు. ప్రత్యేక బృందాలతో ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లో తనిఖీ చేయనున్నారు.

పోలీసుల సూచనలు..

- నూతన సంవత్స వేడుకలకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి.
- రోడ్లు బ్లాక్ చేసి సంబరాలు చేసుకోవద్దు.
- వేడుకల సందర్భంగా టపాసులు పేల్చొద్దు, డీజేలు నిషేధం.
- మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు.
- మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు.
- మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించొద్దు.
- ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దు.
- ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపై, వీధి దీపాలపై రాళ్లు వేడయం, అద్దాలు పగులగొట్టడం చట్టరీత్యా నేరం.
- ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ తీసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేయడం నేరం.
- నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవు.
- మద్యం దుకాణాలు నిర్ణీత సమయంలోనే మూసివేయాలి.
- మైనర్లకు మద్యం విక్రయించొద్దు.
- బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాల్లో మద్యం తాగితే కేసులు నమోదు.
- న్యూ ఇయర్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో, అపరిచితులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నంబర్లు ఇవ్వొద్దు.

జిల్లాకు గుర్తింపు తెస్తా

టార్గెట్-2025

- అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతాం
- ఫోర్త్‌సిటీ, గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు, ఆర్ఆర్ఆర్ కీలకం
- భూ వివాదాలపై ప్రత్యేకంగా దృష్టి
- పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యమే లక్ష్యం
- 'సాక్షి'తో కలెక్టర్ నారాయణరెడ్డి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ప్రభుత్వ ఉద్దేశం, సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే నా ప్రథమ కర్తవ్యం. ఇందులో భాగంగా ఫోర్త్‌సిటీ అభివృద్ధి, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, ఆర్ఆర్ఆర్‌కు భూ సేకరణ, భూ వివాదాల పరిష్కారం వంటి అంశాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తా' అంటున్నారు కలెక్టర్ సి.నారాయణరెడ్డి. ఈ మేరకు సోమవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన అనేక భూ సమస్యలకు 2025 ఓ పరిష్కార మార్గం చూపుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఆ దిశగా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా ఈ రెండు అంశాల్లో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నదే తన భావన అని వివరించారు. ఆయన మాటల్లోనే..

మెప్పించి.. ఒప్పించిన తర్వాతే

ప్రభుత్వం తేబోయే ప్రాజెక్టులకు భూ సేకరణ కీలకం. ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు అధికం. విలువైన భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి నుంచి భూములను బలవంతంగా తీసుకోబోం. సాధ్యమైనంత వరకు వారితో చర్చించి, వారు ఆశించిన స్థాయిలో నష్ట పరిహారం ఇప్పించి, వారిని ఒప్పించిన తర్వాతే భూ సేకరణ విషయంలో ముందుకు వెళ్తాం. వ్యవసాయ నేపథ్య కుటుంబం నుంచి వచ్చిన వాడిగా రైతుల అభిప్రాయానికే ప్రాధాన్యం ఇస్తా. ఫార్మాసిటీ కోసం ఇప్పటికే భూములు ఇచ్చిన రైతులకు మీర్‌ఖాన్‌పేటలో ఇళ్లస్థలాలు సిద్ధం చేస్తున్నాం. పైసా ఖర్చు లేకుండా జనవరిలో వారి పేరున రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు పొజిషన్ చూపిస్తాం.

కోర్టుల్లోనూ కొట్లాడతాం

జిల్లాలో అనేక భూ వివాదాలు నెలకొన్నాయి. వీటిని చాలా జాగ్రత్తగా పరిష్కరించాల్సి ఉంది. కోర్టు కేసుల్లో ఉన్నవాటిని ఏమీ చేయలేం కానీ జిల్లా అధికారిగా నా పరిధిలో ఉన్న ప్రతి అంశానికి పరిష్కార మార్గం చూపించే ప్రయత్నం చేస్తా. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడతా. జిల్లా స్థాయిలోనే కాదు ఆర్డీఓ స్థాయిలోనూ లీగల్ సెల్‌ను మరింత పటిష్టం చేస్తా. ఇటు క్షేత్రస్థాయిలో కబ్జాలను ప్రత్యక్షంగా అడ్డుకోవడమే కాదు.. అటు కోర్టుల్లోనూ బలంగా కొట్లాడతాం. ప్రభుత్వ భూములుగా నిరూపించేందుకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను కోర్టుముందు ఉంచుతాం. సెంటు భూమి కూడా చేజారనివ్వను.

'భూ భారతి'తో సమస్యలకు చెక్

ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో 17,000కుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాస్థాయిలోనే కాకుండా ఆర్డీఓ స్థాయిలో నిర్వహించే 'ప్రజావాణి'లోనూ ఈ సమస్యలు ప్రధానంగా వస్తున్నాయి. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులతో పాటు ప్రజావాణిలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి పరిష్కార మార్గం చూపిస్తా. ఏ సమస్యకు? ఏ అధికారి స్థాయిలో పరిష్కారం లభిస్తుందో? గుర్తించి ఆ మేరకు వాటికి ఆయా స్థాయిల్లోనే పరిష్కారమార్గం చూపేందుకు యత్నిస్తా. ధరణి స్థానంలో ప్రభుత్వం కొత్తగా భూ భారతిని తేబోతోంది. చాలా సమస్యలకు ఇందులో పరిష్కారమార్గం లభిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి,అక్రమాలకు ఆస్కారం ఇవ్వబోం. జిల్లాను రాష్ట్రంలోనే ఉన్నతంగా నిలబెట్టేందుకు కృషి చేస్తా.

ప్రణాళిక ప్రకారం ఫోర్త్‌సిటీ

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా మీర్‌ఖాన్‌పేట వేదికగా ఫోర్త్‌సిటీ తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. విశాలమైన రోడ్లు, పార్కులు, ఆటస్థలాలు, కమ్యూనిటీ భవనాలు, విద్యా, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్దేశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తాను. ఎలాంటి వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తగా ముందుకు వెళ్తాను. గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు, ఆర్ఆర్ఆర్ రోడ్డుకు భూసేకరణ విషయంలో ప్రణాళిక ప్రకారం వెళ్తాం. ప్రభుత్వ ఆలోచన మేరకు నూతన సంవత్సరంలో కొత్త నగరాన్ని కళ్లముందు ఆవిష్కరించే ప్రయత్నం చేస్తాం.

కష్టపడినప్పుడే ఫలితం

ప్రభుత్వ అధికారిగా పని చేయడం తమ అదృష్టంగా భావించాలి. తాము తీసుకునే నిర్ణయాలు, వేతనం కోసం పని చేస్తున్నప్పటికీ.. చేసే పనులతో ఎంతో మందికి మేలు జరుగుతుంది. నిత్యం పాజిటివ్ ఆలోచనతో పని చేయాలి. విద్యార్థి జీవితానికి షార్ట్‌కట్ అంటూ ఏమీ ఉండదు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ మేరకు కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయి. ప్రభుత్వం అనేక నోటిఫికేషన్లు ఇస్తోంది. వాటిని అందిపుచ్చుకునే దిశగా కష్టపడా లి. కొత్త ఏడాది కొత్త లక్ష్యంతో ముందుకు వెళ్లినప్పుడే ఎవరికైనా విజయం సిద్ధిస్తుంది.



మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన జిల్లా జట్టు

కబడ్డీ చాంపియన్లు మనోళ్లే

- రాష్ట్ర స్థాయి సీఎం కప్ టోర్నీలో సత్తా
- మహిళలు, పురుషుల విభాగాల్లో విజయం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పురుషుల, మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ఉత్సాహంగా ముగిశాయి. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి పోటీలను తిలకించారు. పురుషుల, మహిళల ఫైనల్ మ్యాచ్‌ను టాస్‌వేసి ప్రారంభించారు. అనంతరం క్రీడాజట్లకు శుభాకాంక్షలు తెలిపారు. టోర్నీలో పురుషుల, మహిళల విభాగాల్లో రంగారెడ్డి జట్లు చాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నాయి. పురుషుల విభాగంలో రంగారెడ్డి, వనపర్తి జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠంగా సాగింది. మొదటి అర్ధభాగంలో 18–16 పాయింట్ల ఆధిక్యంలో ఉన్న వనపర్తి జట్టు రెండో అర్ధభాగంలో తడబడింది. చివరగా ఆట ముగిసే సమయానికి రంగారెడ్డి 34–31 పాయింట్ల తేడాతో వనపర్తిపై విజయం సాధించింది. మహిళల ఫైనల్లో రంగారెడ్డి 57–39 పాయింట్ల తేడాతో నల్లగొండపై నెగ్గింది. టోర్నీలో గెలుపొందిన జట్లకు త్వరలో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ట్రోఫీలు, మెడల్స్ అందజేస్తారని డీవైఎస్‌ఓ శ్రీనివాస్ తెలిపారు.



పురుషుల విభాగంలో విన్నర్‌గా నిలిచిన జిల్లా జట్టు

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోండి

- న్యూ ఇయర్ వేళ ఎవరికీ ఇబ్బంది కలిగించొద్దు
- హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు
- మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి



మహేశ్వరం: న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి సూచించారు. సోమవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ.. డిసెంబర్ 31న రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ.. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహేశ్వరం జోన్ పరిధిలోని మొత్తం 10 రిసార్ట్‌లు, 62 ఫామ్ హౌస్‌లను అలర్ట్ చేసినట్టు చెప్పారు. ఏడు చోట్ల చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టనున్నట్టు తెలిపారు. అర్ధరాత్రి రోడ్లపై గుర్రాలు, బైక్ రేసింగ్‌ల విషయంలో గట్టి నిఘా పెట్టామన్నారు. డ్రంకెన్ డ్రైవ్, సౌండ్ పొల్యూషన్, బైక్‌లపై ట్రిపుల్ రైడింగ్ చేసే వారితో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, రోడ్లపై వెళ్లేవారికి ఇబ్బందులకు గురి చేయడం లాంటివి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బయటికి పంపించి ఇబ్బందులు పడొద్దని, కుటుంబ సమేతంగా ఇళ్లలో సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. మహేశ్వరం జోన్ పరిధిలోని ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లను అప్రమత్తం చేసినట్టు ఆమె వివరించారు.

వీధి కుక్కల నుంచి కాపాడండి

- చిన్నారుల విన్నపం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్
- స్పందించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే



వీధికుక్కల నుంచి కాపాడాలంటున్న చిన్నారులు

షాద్‌నగర్‌రూరల్: వీధి కుక్కల బారి నుండి తమను కాపాడాలని కోరుతూ ఇద్దరు చిన్నారులు సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు సామాజిక మాధ్యమాల ద్వారా విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని మల్లికార్జున కాలనీకి చెందిన రమ్య గాయత్రీ, రవళి పాఠశాలకు వెళ్లే సమయంలో ఇంటి ముందుకు వచ్చిన వీధి కక్కులను చూసి భయపడ్డారు. ఈ సందర్భంగా వీధి కుక్కల నుంచి కాపాడాలని ఎమ్మెల్యే, కమిషనర్‌ను కోరుతూ చిన్నారులు దిగిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో మాట్లాడారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కుక్కల నివారణకు చర్యలు చేపట్టామని, పఎట్టణ శివారులోని బొబ్బిలి చెరువు సమీపంలో కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

అంకితభావంతో పని చేయాలి

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏసీపీ రంగస్వామి

ఆమనగల్లు: పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని షాద్‌నగర్ ఏసీపీ ఎన్‌సీహెచ్ రంగస్వామి సూచించారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డులను ఆయన పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. చోరీలు జరగకుండా అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్‌నేరాలపై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ఏసీపీ వెంట ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తల్ సీఐ శివప్రసాద్, తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కల్తీ పాల ఉత్పత్తుల గుట్టు రట్టు

పసుమాముల కేంద్రంగా తయారీ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కల్తీపాల ఉత్పత్తుల గుట్టును ఫుడ్‌సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారులు రట్టు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామంలో ఆల్ రిచ్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ (శ్వేత బ్రాండ్ పాలు, పెరుగు) కేంద్రం నిర్వాహకులు కల్తీపాలు, పెరుగు, నెయ్యిని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రూ.1.68 లక్షల విలువ చేసే 280 కిలోల నెయ్యి ప్యాకెట్లు, 350 కిలోల పాల నుంచి తీసిన క్రీమ్ సహా రూ.22,750 విలువ చేసే 850 కిలోల హానికరమైన కాస్టిక్‌సోడాను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ టీం హెడ్ వి.జ్యోతిర్మయి తెలిపారు. నమూనాలు సేకరించి ల్యాబుకు పంపినట్లు చెప్పారు. పాలల్లో హానికర ఫార్మలిన్, డిటర్జెంట్‌లు, అధిక నీళ్లు కలపడం.. పారిశుద్ధ్య లోపంతో కూడిన ప్రదేశాల్లో పాల ఉత్పత్తులను నిల్వ చేయడం.. లైసెన్స్ లేకున్నా ఉన్నట్లు లేబుళ్లపై ముద్రించడం వంటి నేరాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

రైతు కన్నీరు రాష్ట్రానికి అరిష్టం

- వారికి ఎర్రజెండా అండగా ఉంటుంది
- లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
- హకీంపేట్ రైతాంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని


రైతాంగ సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

దుద్యాల్ : రైతు కంట కన్నీరు కారేలా ప్రభుత్వం వ్యవహరిస్తే రాష్ట్రానికి అరిష్టం కలుగుతుందని.. వారికి అన్యాయం చేయరాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం దుద్యాల్ మండలం హకీంపేట్‌లో నిర్వహించిన రైతాంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లగచర్ల ఘటనలో రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎలాంటి షరతులు లేకుండా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ రద్దు కోసం సీపీఎం ఎంతో పోరాటం చేసిందని గుర్తుచేశారు. సమస్యను సీఎంకు వివరిస్తే ఫార్మా స్థానంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. పారిశ్రామిక వాడకు బలవంతంగా భూములు తీసుకోరాదని సూచించారు. రైతులు అంగీకరిస్తేనే భూములు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో కొడంగల్‌కు చెందిన బడా నాయకుల భూములు ఉన్నాయని, వాటిని వదిలేసి గిరిజనుల భూములు తీసుకుంటే ఊరుకోమన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు సరికావు

ప్రస్తుతం అనుభవిస్తున్న రిజర్వేషన్లు, పదవులు అంబేడ్కర్ పుణ్యమే అని తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశంలో అన్ని కులాలు, వర్గాలకు పదవులు అందుతున్నాయంటే అంబేడ్కర్ పెట్టిన భిక్షే అని గుర్తుచేశారు. అలాంటి మహనీయుడిపై అమిత్ షా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. వెంటనే ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ, డీజీ నరసింహా రావ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్‌రాములు, జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, శ్రీనివాస్, బుగ్గప్ప, సుదర్శన్, సతీష్, నర్సమ్మ, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంజారా భవన్ శిలాఫలకం ధ్వంసం

చర్యలు తీసుకోవాలని డిమాండ్

పరిగి: బంజారా భవన్ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, బంజారా సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వివరాలు.. ప్రభుత్వం బంజారా భవన్ నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు కేటాయించింది. దీంతో ఈ నెల 15న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి 10వ వార్డులో ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వసం చేయడంతో కాంగ్రెస్ శ్రేణులు, గిరిజన సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్త వేడుకలపై నజర్

ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలి

- బహిరంగ ప్రదేశాల్లో సంబరాలు వద్దు
- ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవు
- అత్యవసర పరిస్థితిలో 100కు డయల్ చేయాలని సూచన
- 'సాక్షి'తో ఇబ్రహీంపట్నం, ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: నూతన సంవత్సర వేడుకలపై ప్రత్యేక దృష్టిసారించామని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. సోమవారం ‘సాక్షి’తో మాట్లాడారు. వివరాలు ఆయన మాట్లల్లోనే.. గత ఫిబ్రవరిలో ఇబ్రహీపంట్నం ఏసీపీగా బాధ్యతలు చేపట్టా. గతంతో పొల్చుకుంటే దొపిడీలు చాలా వరకు తగ్గాయి. చోరీలకు పాల్పడిన మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన నేరస్తులను సైతం పట్టుకున్నాం. దాదాపు 80 శాతం కేసులను ఛేదించి, నిందితులను అరెస్టు చేశాం. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా డివిజన్‌లోని ఏడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక దృష్టి పెట్టాం. రోడ్లపైకి వచ్చి జనాలకు ఇబ్బందులు కలిగిస్తే సహించం. పిల్లలు, పెద్దలు ఇళ్లలోనే ఉత్సవాలు చేసుకుంటే మంచింది. కొత్త సంవత్సరం వేడుకలకు ఒంటి గంట వరకు అనుమతి ఉంది. బహిరంగ ప్రదేశాల్లో సంబరాలు చేయొద్దు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలి. నిర్ణీత సమయం దాటిన తర్వాత షాపులు, దుకాణాలు, మద్యం విక్రయాలు, ఈవెంట్స్ నిర్వహిస్తే చర్యలు తప్పవు. పోలీస్ యంత్రాంగంతో పటిష్టమైన బందోబస్తు, పెట్రోలింగ్‌ను నిర్వహిస్తున్నాం.

మూడు చోట్ల తనిఖీలు..

తుర్కయాంజల్, ఇబ్రహీంపట్నం బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, ఆగాపల్లి వద్ద తనిఖీలు నిర్వహిస్తాం. నిషేధిత గాంజా, డ్రగ్స్ వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.



కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం

ర్యాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చేయొద్దు. తుర్కయాంజాల్ పరిధిలోని ఒక్క బీఆర్ఆర్ సార్థ ఫంక్షన్ హాల్‌లో జరిగే వేడుకలకు మాత్రమే అనుమతి ఉంది. ఫాం హౌస్‌లు, రిసార్ట్‌లలో జరిగే ఈవెంట్స్‌కు ఎలాంటి అనుమతులులేవు. అయితే అక్కడ లిక్కర్ పెడితే ఎక్సైజ్ శాఖ అనుమతులు తప్పనిసరి తీసుకోవాలి. న్యూఇయర్ పేరుతో సైబర్ నేరగాళ్ల రెచ్చిపోయే ప్రమాదం ఉంది. అపరిచిత వ్యక్తుల ఫోన్స్, ఎస్ఎంఎస్‌లు, వాట్సప్‌లకు స్పందించకూడదు. శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీసులు లేదా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలి. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

కష్టసుఖాలు మన సృష్టే..

కద్తాల్: మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు సోమవారం పదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5నుంచి 8 గంటల వరకు సామూహిక సంగీత ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిణీత పత్రి ప్రసంగిస్తూ.. మన జీవితానికి మనమే బాధ్యులమని, మన కష్టాలు, సుఖాలు మనం సృష్టించుకున్నవేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కళాకారిణి నృత్యప్రదర్శన

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు

యాచారం: సీఎం కప్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు యాచారం జెడ్పీహెచ్ఎస్ నుంచి ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్ఎం నర్సింహ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్ అండర్–14 (కిడ్స్ జావిలిన్‌త్రో) విభాగంలో 7వ తరగతి విద్యార్థిని క్రిషిక జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 31, జనవరి 1,2 తేదీల్లో హన్మకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటుందని చెప్పారు. పదోతరగతి విద్యార్థిని అక్షిత పారా అథ్లెటిక్స్ విభాగాంలోని 100మీ., 200 మీ. షాట్‌పుట్ విభాగంలో ప్రతిభ చాటింది. ఈ నెల 31, జనవరి 1,2 తేదీల్లో గచ్చిబౌలిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక్వడం తమకు గర్వకారణం అన్నారు.

నవ వధువు బలవన్మరణం

మంచాల: కడపు నొప్పి భరించలేక ఓ నవ వధువు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని తాళ్లపల్లిగూడలో సోమవారం వెలుగులోకి వచ్చింది. మంచాల పోలీసులు తెలిపిన ప్రకారం.. యాచారం మండల పరిధిలోని చౌదరిపల్లి గ్రామానికి చెందిన మనీషా(20)కు తాళ్లపల్లిగూడకు చెందిన రావుల రమేశ్‌తో నెలరోజుల క్రితం వివాహమైంది. ఆదివారం కుటుంబ సభ్యులు పొలం పనికి వెళ్లగా మధ్యాహ్న సమయంలో ఆమె ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం కుటుంబ సభ్యులు వచ్చేవరకు విగతజీవిగా వేలాడుతుంది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా యువతి కుటుంబీకులు కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాదచారిని ఢీకొట్టిన స్కూటీ

- నేపాల్ వాసి దుర్మరణం
- ద్విచక్రవాహనదారుడి పరిస్థితి విషమం

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు దాటుతున్న పాదచారుడిని స్కూటీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన ప్రకారం.. నేపాల్‌కు చెందిన గోవింద్ సాయి(60) కొన్నేళ్ల క్రితం భారతదేశానికి వలస వచ్చాడు. మన్నెగూడలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి 10.30గంటల సమయంలో మన్నెగూడలోని దుర్గా వైన్స్ వద్ద రోడ్డు దాటి నడుచుకుంటూ వెళ్తుండగా.. బొంగ్లూరు నుంచి బీఎన్‌రెడ్డి వైపు వెళ్తున్న స్కూటీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోవింద్ సాయి తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన్ను వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ద్విచక్రవాహనదారుడు ఎం.నరేశ్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

క్రేన్ ఢీకొట్టి వృద్ధుడు..

రోడ్డుపై నడుచుకుంటున్న వృద్ధుడిని క్రేన్ ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. రాగన్నగూడ జీవీఆర్ కాలనీకి చెందిన బండారు జంగయ్య(65) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గణేశ్ టెంపుల్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న జంగయ్యను హెవీ క్రేన్ ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా క్రేన్ డ్రైవర్ వాహనం వదిలి పరారయ్యాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇందిరమ్మ సర్వేలో ఇరువర్గాల ఘర్షణ

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- హైదరాబాద్‌కు తరలింపు
- వికారాబాద్ జిల్లా గుండాలతండాలో ఘటన
- ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు


గుండాలలో ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఆనంద్ కుమార్


గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

దోమ: ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తుండగా ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా దోమ మండలం గుండాలతండాలో సోమవారం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని అధికార పార్టీకి చెందిన వారు అధికారులకు సూచించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ మద్దతుదారులు కల్పించుకోవడంతో గొడవ మొదలైంది. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వివాదాస్పదమైంది. దీంతో పలువురు నేతల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేసి, ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. సహనం కోల్పోయిన ఇరువర్గాల వారు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో కాంగ్రెస్ మద్దతుదారులైన చందర్, సురేశ్, రవి, దేవమ్మ, రెడ్యానాయక్ తీవ్రంగా గాయపడగా, మాణిక్‌నాయక్, నార్యనాయక్, ఆకాశ్ స్వల్పంగా గాయపడ్డారు. వీరందరినీ పరిగి ఆస్పత్రికి తరలించగా చందర్, సురేశ్, రవి, దేవమ్మ, రెడ్యానాయక్‌ను మెరుగైన చికిత్స కోసం నగరానికి తీసుకెళ్లారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

టీచర్ల వేధింపులతోనే ఆత్మహత్యాయత్నం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన గురుకుల విద్యార్థిని తల్లిదండ్రులు
- నడుము విరగడంతో మంచానికే పరిమితమైన బాలిక
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన


లావణ్య (ఫైల్)

ఇబ్రహీంపట్నం: గురుకుల పాఠశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థిని మంచానికే పరిమితమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు వివరాలు.. నగరంలోని రాజేంద్రనగర్ పరిధి బండ్లగూడ సమీపంలోని లక్ష్మీగూడ వాంబే కాలనీకి చెందిన విద్యార్థిని లావణ్య (14) చర్లపటేల్‌గూడలోని రాజమహేంద్ర కళాశాలలో కొనసాగుతున్న చంద్రాయణగుట్ట మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతుంది. ఈ క్రమంలో బాలిక నవంబర్ 9న ఉదయం కళాశాల భవనం మొదటి అంతస్తుపై నుంచి దూకడంతో నడుముకు తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నడుముకు ఆపరేషన్ చేసిన ఫలితం దక్కలేదు. కాళ్లు కదల్చకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ నెల 25న డిశ్చార్జి అయిన లావణ్య మంచానికే పరిమితమైంది. నీకు చదువురాదు.. నీ బ్రతుకు దండగా అని టీచర్లు అవహేళన చేస్తూ మాట్లాడినందునే తన కూతురు మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని తండ్రి నాగరాజు ఈ నెల 27న ఇబ్రహీంపట్నం ఠాణాలో ఆలస్యంగా ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

హోటళ్లలో పోలీసుల తనిఖీలు

పహాడీషరీఫ్: నూతన సంవత్సవ వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో బాలాపూర్ పోలీసులు సోమవారం మండి హోటళ్లలో సోదాలు నిర్వహించారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ నేతృత్వంలో సిబ్బంది సోదాలు నిర్వహించారు. హోటళ్లకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌లు పరిశీలించారు. డిసెంబర్ 31న రాత్రి సెలబ్రేషన్స్‌లో డ్రగ్స్, పేకాట, రేవ్ పార్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. హోటళ్లపై నిఘా ఉందని ఏ చిన్న ఘటన చోటు చేసుకున్నా కేసులు నమోదు చేస్తామన్నారు.


హోటల్‌లో సోదాలు చేస్తున్న ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి

ఈ తనిఖీల్లో ఎస్ఐలు షేక్ యూసుఫ్ జానీ, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పట్టాలకే పరిమితం


తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో
- భారీగా నిలిచిపోయిన వాహనాలు

ఆమనగల్లు: పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలకు సంబంధించి స్థలాలు చూపించాలని కోరుతూ బాధితులు, బీజేపీ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. తలకొండపల్లి మండల కేంద్రంలో సర్వే నంబర్ 6,7 లో 1998 నుంచి 2000 వరకు పలువురు పేదలకు అధికారులు పట్టాలు ఇచ్చి స్థలాలు చూపలేదు. చివరకు 2023లో పాత పట్టాలున్న వారికి మరో మారు ఇంటి పట్టలు పంపిణీ చేశారు. 2023లోనూ స్థలాలు చూపకపోవడంతో బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు స్పందించకపోవడంతో బీజేపీ ఆధ్వర్యంలో రోడ్డుపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు నచ్చజెప్పినప్పటికీ ఆందోళనకారులు వినిపించుకోలేదు. చివరకు తహసీల్దార్ నాగార్జున రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడారు. ఇంటి పట్టాలు ఉన్నవారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ధర్నాలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, జిల్లా నాయకులు పాండు, కుమార్, పాండు, రాజు, పద్మ అనిల్ ముదిరాజు, స్థానిక నాయకులు యాదయ్య, శేఖర్‌రెడ్డి, కుమార్, హరికాంత్, సుదర్శన్, మహేశ్, హర్యానాయక్, శ్రీను, నాగరాజు, పాండు, శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి ఏడాది జైలు

పూడూరు: చీటింగ్ కేసులో ఇద్దరికి జైలు శిక్షతో పాటుగా జరిమానా విధించారని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సోమవారం తెలిపారు. చన్గోముల్‌కు చెందిన రామచంద్రారెడ్డి, బందె సత్తార్‌ఖాన్ తనను మోసం చేశారని అంగడిచిట్టంపల్లికి చెందిన ఖాజామునీరుద్దీన్ 2012లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన అప్పటి ఎస్ఐ మక్బూల్‌అలీ కేసు అభియోగపత్రాలు కోర్టుకు సమర్పించారు. ఈ మేరకు పరిగి కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నాగుల స్వప్న వాదనలు విని నేరం రుజువు కావడంతో రాచంద్రారెడ్డి, సత్తార్‌ఖాన్‌కు ఏడాది జైలు శిక్షతో పాటుగా రూ.6వేల జరిమానా విధించారని చెప్పారు.

అత్యాచారం కేసులో జీవిత ఖైదు

దౌల్తాబాద్: అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించిన సంఘటన సోమవారం దౌల్తాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రవి గౌడ్ ప్రకారం.. చెల్లపూర్ గ్రామానికి చెందిన గోవిందుపై దౌల్తాబాద్ పోలీసులు 2022లో పోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సోమవారం వికారాబాద్ సెషన్స్ కోర్టు జడ్జి సీహెచ్.చంద్ర కిషోర్ కేసు వివరాలు పరిశీలించి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు లక్షన్నర జరిమానా విధించారు.

వ్యక్తి అదృశ్యం

అనంతగిరి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ మండలం పీరంపల్లి గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి అనే వ్యక్తి ఈ నెల 24న రోజు మాదిరిగానే ఉదయం 9గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య లక్ష్మమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసినవారు 8712670030 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తాండూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పెద్దేముల్ మండల పరిధిలోని గిర్మాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దివిజా నాయక్(60) హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన ఆయన ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

ఇబ్రహీంపట్నం: సీపీఎం జిల్లా నూతన కార్యదర్శిగా మంచాల మండలంలోని చెన్నారెడ్డిగూడేనికి చెందిన పగడాల యాదయ్య ఆదివారం ఎన్నికయ్యారు. ఇబ్రహీంపట్నంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన జిల్లా మహాసభల్లో పార్టీ పెద్దలు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. 1986లో సీపీఎం అనుబంధ సంస్థ డీవైఎఫ్ఐలో చేరా. చెన్నరెడ్డిగూడ గ్రామ కార్యదర్శిగా పార్టీ బాధ్యతలు నిర్వర్తించాను. అనంతరం గ్రామ సీపీఎం కార్యదర్శిగా, మంచాల మండల కార్యదర్శిగా, 1990లో జిల్లా కమిటీ సభ్యుడిగా, 1995 నుంచి ఇప్పటి వరకు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా పనిచేశాను. పార్టీ నేతలు పాషా, నరహరి హత్యల అనంతరం విద్యాభ్యాసాన్ని (డిగ్రీ సెంకడ్ ఇయర్‌లో)వదిలిపెట్టాను. ఎన్ఎఫ్‌సీలో ఉద్యోగం వచ్చినా చేరలేదు. 1990 నుంచి పార్టీలో చురుగ్గా పని చేస్తున్నాను. ఆరుట్ల పీఏసీఎస్ చైర్మన్‌గా 1992లో, 1995లో మంచాల మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడిగా, 2000లో మంచాల జెడ్పీటీసీగా పనిచేశాను. 2014 నుంచి వరుసగా మూడు దఫాలు సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇబ్రహీంపట్నం నుంచి పోటీ చేశా. పేదల పక్షాన పార్టీలో పనిచేసే క్రమంలో ఎన్నో ఒడిదొడుకులు, కష్టనష్టాలు, నిర్బంధాలను ఎదుర్కొన్నాను. నాపై సుమారు 128 కేసులు పెట్టారు. జైలుకు వెళ్లా, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం వదలలేదు. రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తున్నాను. జిల్లా లోని భూములను కార్పొరేట్, పెట్టుబడిదారి సంస్థలకు అప్పగిస్తున్నారు. పేదల భూములను ప్రభుత్వాలు కొల్లగొడుతున్నాయి. ధరణి పేరుతో పేదలకిచ్చిన భూముల రికార్డులకు ఎక్కకుండా చేశారు. కార్మికులు అనేక త్యాగాలు చేసి సాధించుకున్న చట్టా లను, హక్కులను నేటి పాలకులు హరించి వేస్తున్నారు. వృత్తి సంఘాలను బలోపేతం చేసి వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం. నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు సరైన న్యా యం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తాను.

